ఉన్న ఉద్యోగాన్ని వొదులుకుని చిన్న యూనిట్ పెట్టుకున్న మంచి ఇంజనీరుని



# చిన్న పరిశ్రమలు- పెద్ద కథలు

డాక్టర్ సోమరాజు సుశీల

ఆఫీసులో చాలా సీరియస్‌గా ఎకౌంట్సు చూసుకుంటున్నా! మామూలుగా నేనెప్పుడూ ఆదాయ వ్యయాల జోలికెళ్ళను. అవి చూస్తే గబుక్కున ఏ హార్ట్ ఎటాకో వచ్చిందనుకో! నన్ను నమ్ముకున్న వాళ్ళేమైపోతారు? డబ్బులొస్తూనే ఉంటాయి. అప్పులు అప్పుల్లానే వుంటాయి. ఇబ్బందులు ఇబ్బందుల్లానే వుంటాయి. ఖర్చులు ఖర్చుల్లానే వుంటాయి.

ఈ ఆర్థిక జాలం ఏమిటో ఎంతకీ కొరుకుడు పడట్లేదు. పోనీమంటే మనమేవన్నా క్లబ్బుల్లో పేకలాడుతున్నామా, సంవత్సరానికో కారు మారుస్తున్నామా, విదేశీ యాత్రలు చేస్తున్నామా, నగలూ నాణ్యాలూ చేయించుకుంటున్నామా! ఏమీ లేదు! ఎక్కడ వేసిన గొంగళి అక్కడే! ముప్ఫయ్ ఏళ్ల నుంచీ నేనే రెండు పూటలా వంట చేస్తున్నా, అదే కారు రిపేర్లు చేసిచేసి నడుపుతున్నా, ఏసీ త్రీటైర్‌లోనే ప్రయాణాలు చేస్తున్నా, రెండు నెల లాలస్యంగానే జీతాలిస్తున్నా. పోనీమని తోచీ తోచక రెండు కాంపోజులేసుకుని ధైర్యంగా బ్యాంకు కెడితే అత్తారివేపు చుట్టాలొచ్చినట్లు అంటీ అంటకుండా వుండే మాటలు. గట్టిగా మాట్లాడితే పనవదేమోనని మనకి భయం. స్నేహంగా పలకరిస్తే ఏమైనా కమిటయి పోవాలేమోనని వాళ్ళకి భయం. విడాకుల కస్లై చేసుకున్న దంపతుల్లాగా చాలా మర్యాదగా క్లుప్తంగా కోర్టు ధిక్కార నేరం మీద పడకుండా వుండేటట్లుంటాయి చర్చలు. తుమ్మల్లో పొద్దు వూకి నట్లుండే ఈ 'సుహృద్భావ' వాతావరణంలో పరిశ్రమలు విజయవంతం కావడం సంగతి దేవుడెరుగు. కునుకేయకుండా ఉంటే అదే గొప్ప!

ఇప్పుడవే లెఖ్ఖలు చూస్తుంటే గాభరా వస్తోంది. రావల్సిన బాకీలు అలా వుంటేనే లెఖ్ఖ తెలుస్తోంది. వచ్చినవి ఏమైపోతున్నాయో తెలియట్లేదు. మా ఫీల్డాఫీసరు గారంటారు- "మీరు నాలుగు నెలల క్రితం 12 లక్షలకి బిల్లులు సబ్మిట్ చేశారు. ఇప్పటి వరకు 4 లక్షలు డిపాజిట్ చేశారు. మిగతాది ఏమైంది? ఎప్పుడొస్తుందని!"

ఏడు లక్షలు వసూలైన మాట నిజమే. నాలుగు బాంకులో కట్టాం. రెండు జీతాలకి,

## చదువుకుంటున్న చంద్రహారం

మార్కెటింగ్ ఖర్చులకీ అయిపోయింది. ఆ మిగతా ఒకటి ఎక్కడుంది చెప్మా!

పోనీ రావాల్సిన 5లో ఒకటొచ్చే ఛాన్స్ లేదు. ఆ డీలరు టోపీ పెట్టేశాడు. సరుకమ్మేశా బాకీలు రావన్నాడు. ఇంక మిగిలిన నాలుగు మార్చిదాకా రావుట. అంటే ఈ నాలుగు నెలలు నేను కుర్రాళ్ళని పెట్టుకుని జీతాలిచ్చుకోవాలి. అంటే మళ్ళీ సగం పైగా జీతాలకే పోతుంది. ఈ టైములో వీళ్ళు వసూళ్ళు ఒక్కటే కాకుండా ఏమన్నా అమ్ముతారేమో అంటే ఇది ఆఫ్ సీజను. ఇంకా నేను రా మెటీరిల్స్ వాడికి లక్షన్నర ఇవ్వాలి.

దీన్నిబట్టి ఏతావాతా తేలేదేమిటయ్యా అంటే మా దగ్గర ఆరుగురు కుర్రాళ్ళకి ఏడాది జీతం దొరికింది. రా మెటీరియల్ వాడికి ఏడు లక్షల సరుక్కి కమీషన్ దొరికింది. బాంకు వాళ్ళకి 9 లక్షల మీద ఆరునెలల వడ్డీ దొరికింది. వాకు బోలెడంత టైం పాసయ్యింది. ఇదీ కథ! ఏదైనా పని చేస్తే లాభమా? చెయ్యక పోతే లాభమా? తల్లా?- పెళ్లామా? అన్నంత డైలమాలో పడిపోయా!

"మేడమ్! మీకోసం 'తక్షణ' చిట్స్ మేనేజరు గారొచ్చారు!"

"రాజూ! మనం చిట్స్‌లో చేరమని తెలుసుగా! చేరమని చెప్పెయ్యి."

"కాదు మేడమ్! మిమ్మల్ని అర్జెంటుగా కలవాలంటున్నారు."

"సరే! రమ్మను!"

నలభై ఏళ్ళాయిన లోపలకి వచ్చాడు. చూస్తే ఏదో ఆఫీసు సూపరింటెండెంట్‌లా వున్నాడు. వస్తూనే బ్రీఫ్‌కేసు బల్లమీద పెట్టి ఏవో కాయితాలు పైకి తీశాడు. కార్డు తీసిచ్చాడు.

"నమస్కారమండీ. నేను తక్షణ చిట్స్ కలెక్టింగ్ ఏజెంట్‌ని. మీరు రామ్మూర్తి గారికి గ్యారంటీ ఇచ్చారా?"

"ఓ! మీదా చిట్ కంపెనీనా? అవును. ఆయన మాకు చాలా కావలసిన వ్యక్తి. ఏవిటి సంగతి?"

"వారు రెండు లక్షల చిట్ పాడారు మేడం. ఆరవ నెలలో వాళ్ళకి ఎలాట్ అయింది. తరువాత రెండు మూడు ఇన్‌స్టాల్‌మెంట్స్ కట్టారు. పది నెలల నించి పేమెంట్ లేదు. ఎన్ని లెటర్సు రాసినా జవాబు లేదు. కోర్టులో పేపరు వేసే ముందు మీకు చెప్పి వెడదామని వచ్చాం."

"ఈ పాటి దానికి కోర్టు ఎందుకు లెండి! ఆయన చాలా మంచివారు ఏం ఇబ్బందులొచ్చాయో మరి. నేను కనుక్కుంటా - మీరు తొందర పడకండి!"


మళ్ళీ వారమయ్యాక ఫోన్ చేస్తానని చెప్పి వెళ్ళిపోయాడు.

మా ఫ్రెండ్సులో ఒకరి కొకళ్ళు చిన్నచిన్న మొత్తాలకి హామీ లిచ్చుకోవడం మామూలే. రామ్మూర్తిగారికి ఏదో చికాకులుగా వున్నాయని వాళ్లావిడ అన్నపూర్ణ ఆ మధ్య చెప్పిందిగానీ మరీ ఇంతగా విసిగిస్తున్నా యనుకోలేదు. ఇది వరకు రెండు మూడుసార్లు హామీలున్నా

రైలుకు బొగ్గేసే వాడిలా తయారు చేసిన మన పారిశ్రామికీకరణ!

ఎప్పుడూ ఒక్క నోటీసు కూడా రాలేదు.

అసలాయన డబ్బు విషయంలో చాలా నిక్కచ్చిగా వుంటాడు. మూడు నాలుగు లక్షల బాంకు అప్పుతో, అద్దె బిల్డింగులోనే చిన్న వర్కుషాపు పెట్టి లాక్కొస్తున్నారు. స్పెషల్ కాంపొనెంట్స్ తయారీలో ఆయన చాలా బ్రిలియంట్ ఇంజనీరు. అందుకే పెద్ద పెట్టుబడులు లేకపోయినా మంచి ఆర్డర్లు ఆయన్నే వెతుక్కుంటూ వస్తాయి. కాకపోతే శ్రీరాములు మొదలుకొని చిత్తగించ వలెను వరకు తనే



చేసుకుంటాడు. ఎవర్తోనూ మాట్లాడడు. ఎవరినీ నమ్మడు. చిత్రంగా మా ఆయనకి తనకి బాగా కలిసింది. ఎప్పుడైనా రెండు మూడు నెలల కోసారి కూచుని బ్రిడ్జోహాండ్స్ డిస్కస్ చేసుకుంటారు. వాళ్ళ ఆవిడ అన్నపూర్ణదీ మాదీ ఒక ఊరే.

ఆ రాత్రి అన్నపూర్ణ ఫోన్ చేసింది. చాలా

పూర్వకాలం మనిషి, బాగా కలిగిన వాళ్ళింట్లో పుట్టిన కడసారి గారాల పట్టి. తనకి ఏభై ఏళ్ళు వచ్చాయని ఎప్పుడూ గుర్తుండదు. పిల్లలు కలగలేదు. అందువల్ల తానే ఇంకా చిన్నపిల్ల లాగా ఆలోచిస్తుంది. అస్తమానం వాళ్ల అన్నయ్య కబుర్లే. అందరికీ భర్తలే దైవాలేమోగానీ తనకి మాత్రం వాళ్ళ అన్నయ్యే దైవం. పది మాటల్లో రెండు మాటలు వాళ్ళ అన్నయ్య గురించే ఉంటాయి.

"ఇదిగో సుశీలా నిజం చెప్పు! నే వుండాలా? ఏ నుయ్యో గొయ్యో చూసుకోవాలా?"

"ఏమయింది తల్లీ! నా మీద యుద్ధం ప్రకటిస్తున్నావు? మూర్తిగారు ఊళ్లో లేరా?"

"ఏం చెయ్యమంటావు? మీ అన్నా చెల్లెళ్ళిద్దరూ ఒక్కటే. నన్ను సుఖంగా బతకనీయరు. పొద్దున్న ఆరుగంటలకి వర్క్‌షాపుకని వెళ్ళిన మనిషి ఇంతవరకూ అయిపూ అజా లేరు. అన్నీ నా ప్రాణం మీదకే. పదిన్నరయినా కొంప చేరాలని వూసు లేకపోతే ఎలా చెప్పు? ఈ వేళ ఎవడో చిట్ కంపెనీ వాడు మా అన్నయ్య ఆఫీసుకెళ్ళాడట. నీ దగ్గిరక్కూడా వచ్చాడుగా! వెంటనే డబ్బు కట్టాలి. లేకపోతే కోర్టు కెడతానని చెప్పి వెళ్లి పోయాడు. మా అన్నయ్య కనుక్కుంటే వర్క్‌షాపులో ఈయన లేరుట. నాకు ఫోన్ చేసి 'ఏవిటే అమ్మాయి. ఇతగాడిలా తయారయ్యాడని' అంటే నాకు తల కొట్టేసి నట్లయింది. ఎక్కడి కెళ్ళారోనని నాకు ఒక్కటే గాభరాగా వుంది. అన్నీ అక్కర లేని పనులే చేస్తారు. చాకలాడి గాడిదయినా కాసేపు పడుకుంటుందేమో గాని ఈయన అదీ లేదు. అర్ధరాత్రి కూచుని ఏవో లెఖ్ఖలేసుకుంటూ వుంటారు. శిష్టా వారి కుంటుంబం. పిల్లవాడు తెల్లగా అందంగా వున్నాడు. ఏడెకరాలు పొలం వుంది. పైగా ఇంజనీరు అని మా అన్నయ్య నచ్చి చేశాడు కానీ ఆ రంగూ లేదు, రూపూ లేదు. ఎప్పుడూ రైల్లో బొగ్గేసే వాళ్ళలా ఒకటే అవతారం."

"ఇదిగో పూర్ణా! అర్ధం లేకుండా మాట్లాడకు! నీకు చాదస్తం ఎక్కువై పోతోంది. మళ్ళీ చిన్నతనం వదలనట్లుంటావు. ఎప్పుడో నువ్వు ముప్ఫయ్ ఏళ్ళ క్రితం వరించావు కదాని ఎప్పుడూ అలాగే వుండమంటే ఎలా? విషయం మార్చి గోల చేయకు. భోజనం చేసి పడుకో. చిట్ కంపెనీ వాడొస్తేనే. ఇంత భయపడే దానివి ఆయన చేత వర్క్‌షాపు ఎలా పెట్టించావు?"

"అసలీ మనిషి నోట్లో వేలెడితే కొరక లేదు భజ్రాజమానంలా వుండేవాడు. ఉన్నట్టుండి ఉద్యోగం మానేసి ఇంతపని చేస్తారని కల్లో కూడా అనుకోలా. ప్రమోషు నివ్వలేదని ఉన్న ఉద్యోగం మానుకుంటారా ఎవరైనా?

నాకొక్కటయినా చెప్పి ఏడిస్తేగా? చేశాక ఏడవడమేగానీ! మా అమ్మవాళ్లకి అప్పంటే ఎంత భయమో! ఒకళ్ళకి పెట్టిన వాళ్లమేగానీ ఒకరి ముందెప్పుడూ చెయ్యి చాచెరగం. ఈయనింత చాకిరీ చెయ్యకపోతే ఎవరేడిశారు చెప్పు మా కేమయినా పిల్లలా జెల్లలా ఎవరికోసం. హెచ్.ఎం.టి.లో మంచి ఉద్యోగం. కడుపులో చల్ల కదలకుండా వుంటారని మా అన్నయ్య..."

"ఇదిగో నువ్వు మళ్ళీ నీ పెళ్ళి కబుర్లు చెప్పకు. నువ్వు సరే! మీ అన్నయ్యా సరే! మీ ఇద్దరి మీదా ఇంకో రక్త సంబంధం సినిమా తియ్యొచ్చు. ఆ కట్టాల్సిందేదో కట్టేస్తే వాడే పోతాడు. నువ్వింక ఫోన్ పెట్టెయ్యి."

"అది కాదోయ్. మా అన్నయ్యకేదో అనుమానం వచ్చినట్లుంది. 'చంద్రహారం వేసుకు రావే అమ్మాయీ రేపు పండగకి. అమ్మని చూసినట్లుంటుం'దన్నాడు. అదేమో ఈయన చదువుకుంటూ వుండమని బాంకులో పెట్టాడు."

సర్లే అన్నీ తీరిగ్గా మాట్లాడుకుందామని ఫోన్ పెట్టేశాను.

తన అమాయకత్వానికి నాకు కోపమూ నవ్వూ రెండూ వస్తున్నాయి. ఈ కాలంలో కూడా ఆడవాళ్లింత అమాయకత్వంగా వుంటే ఎలా? అయినా రామ్మూర్తిగారిని అనాలి. ఆవిడనో పరమ శుంఠని చూసినట్లు చూస్తాడు. ఏ విషయమూ సరిగ్గా చెప్పడు. ఏదైనా విషయం అర్థం అయీ అవకుండా తెలిస్తే దానంత బాధ అదే.

మాకయితే ఏ విషయానికీ రహస్య మనేదే వుండదు. మా ఇంట్లో మాట్లాడుకుంటే నేను వంటింట్లోంచీ ఆయన హాల్లోంచీ. ఫ్యాక్టరీలో అయితే నేను నా రూమ్ లోంచీ ఆయన తన లాబ్ లోంచీనూ. ఉరుములు, మెరుపులు, పిడుగులు పడి కుండపోత కురిశాక అందరం హాయిగా తోటలో మొక్కల్లాగా ఫ్రెష్‌గా అయిపోతాం. అసలు చీకాకంతా ఈ సీక్రెట్లున్న వాళ్ళతోనే బాబూ!

మర్నాడు పొద్దున్న ఆరున్నరకే ఫోన్ మోగింది!

నన్ను గురించి తెలిసిన వాళ్ళెవరూ నాకు ఎనిమిది లోపల ఫోన్ చేయరు! బహుశా ఏ ఎస్.టి.డి. కాలో అయియుంటుందని ఎప్పుడో లేచేసిన వాళ్ళ గొంతుకలాగా ఏక్టివ్‌గా పెట్టి హలోమన్నా!

"సుశీలమ్మా! నేను పూర్ణ అన్నయ్యని భుజంగాన్ని. పూజ అదీ అయిపోయిందా? మళ్ళీ వంటలో పడితే నీకు డిస్టర్బ్ అవుతుందని ఇపుడే చేశా. అంతా కులాసావా? మా బావగారెలా వున్నారు?"

"అంతా బాగానే వున్నారు. మీ పిల్లలూ వదినా అంతా బాగున్నారా?"

"ఆవా!" ఇంతకీ ఎందుకు చేశానంటే, పూర్ణ వాళ్ళాయిన బిజినెస్ గురించి నీతో మాట్లాడదామని. వాళ్ళు – ఇల్లా బాంకుకి పెట్టేశారు. ఇప్పుడేమో చిట్టీవాడు కోర్టు కెడతానని నిన్న వచ్చి బెదిరించి వెళ్లాడు! మా కెవ్వరికీ రాత్రినించి నిద్రాహారేల్లేవు! అందర్లోకీ గారంగా పెంచితే ఇప్పుడు దాని భవిష్యత్తేమిటా అని మా కొకటే బెంగ. పోనీమంటే మాతో అతగాడేమీ చెప్పడు. పైగా ఈ మధ్య కారులో కూడా రాకుండా స్కూటరు మీదొస్తున్నాడు."

"మీరు భయపడకండన్నయ్యా! ఆయనేం చిన్నవారు కాదు, అసమర్థులు కారు. ఒడిదుడుకులు మీ ఉద్యోగాల్లో వుండవా? ఆ తట్టుకునే ధైర్యం ఉండబట్టే కదా చేస్తున్నారు. అయినా ఇలా మీరు నాతో మాట్లాడితే మా ఆయన నన్ను కోప్పడతారు. మీరు ధైర్యంగా ఉండండి. ఎప్పుడైనా ఆయనతో మాట్లాడండి" ఫోన్ పెట్టేసి మళ్ళీ శుభ్రంగా నిద్రపోయా!

పదీ పదిన్నర మధ్య మేమిద్దరం యూనిట్లో ఎవరం ఎక్కువ కష్టపడి పనిచేస్తున్నామో చార్ట్ చేస్తుంటే వచ్చారు రామ్మూర్తిగారు. ఆయన వచ్చి వెనకాలే నిలబడినా మనకి తెలియదు. అంత నిశ్శబ్దంగా మసలుతారు. ఎలా సాధ్యమో మరి.

గబుక్కున వెనక్కి తిరిగి చూశా! "ఎంత సేపయింది వచ్చి?"

"మీ ఇద్దరు గడిచిన మూణ్ణెల్ల డేటా అంతా ఇంటిగ్రేట్ చేస్తున్నారే! అప్పుడు వచ్చా."

"అవును. ఏమిటి మీరీ మధ్య ఇంటికి వెళ్ళడం లేదుట?"

"పూర్ణ చేసిన ఫోన్ మూలంగానే నాకీ అపనిందలు. నేనింటికి రాలేదని మీతో చెప్పిందా? మళ్ళీ రాత్రి అంతా నన్ను కాల్చుకు తినేసింది. అనవసరంగా సుశీలకు ఫోన్ చేసి కంగారు పెట్టాను. మీరిల్లు చేరానని చెప్పండీ అని. అప్పటికే పన్నెండయింది. తనేం కంగారు పడదులే కలుస్తానని ధైర్యం చెప్పా! మీరేమనుకున్నారో!"

"పూర్ణ కంగారు సంగతి మీరు నాకు

చెప్పాలా? కాఫీ తీసుకుంటారా?"

ఈయన సమాధానం "ఆ రెండు చెప్ప"

"చెప్పండి సార్! ఎలా వుంది బిజినెస్?"

"నడుస్తోంది. నేనే రోజూ ఫోన్ చేద్దామను కుంటూనే అశ్రద్ధ చేశా. మనం కలిసి కూడా చాలా రోజులైంది. ఇల్లు చేరేటప్పటికే పది దాటి పోతోంది. ఇది వరకులా ఈ ట్రాఫిక్‌లో కారు డ్రైవ్ చేయలేక పోతున్నా. స్కూటరయితే పది నిమిషాలు పట్టేది కారయితే అరగంటవుతోంది. అందుకే స్కూటరు రిపేరు చేయించి మళ్ళీ వాడుతున్నా."

నే నన్నా. "ఏభై దాటాక స్కూటరు నడపటం శ్రేయస్కరం కాదు. టైము కలిసొస్తుంది కదా అని పరుగులు పెట్టే వయసు కాదు కదా మనది. ఎవర్నైనా కుర్రాణ్ణి పెట్టుకోకూడదూ చేతి కింద?"

"వాళ్ళకి నేర్పినంత కాలం మన దగ్గర పని చేయరు. అందుకే నాకు ఎవరికైనా అప్ప జెప్పా లంటే విసుగు. ఈమధ్య లక్షణ చిట్స్ వాళ్ళకి చాలా ఇన్‌స్టాల్‌మెంట్స్ బాకీ పడటంతో చీకాగ్గా వుంది. ఇన్నేళ్ళలో ఎప్పుడూ మినిమమ్ బిడ్డింగ్ చేయలేదు. కానీ ఈసారి అలా చెయ్య వలసి వచ్చింది. నిన్న వాళ్ళు మీ దగ్గరకి వచ్చారుట!"


"అదేం పెద్ద విశేషమూ ఏమిటి? మనకిదివరకు రోజూ ఉండేదేగా. వారం తర్వాత కాంటాక్టు చేయమని చెప్పాను. అసలు మన బ్యాంకులు మన కష్టాన్నీ, అవసరాన్నీ గుర్తిస్తే మనకిన్ని పాట్లుండవు."

"నిజమే! నేను ముందు మా బ్యాంక్‌నే అడిగా. నాలుగు లక్షల వరకూ అవసరం పడింది. వాళ్ళేమో ఇంకేదయినా ప్రాపర్టీ కొల్లేటరల్ పెట్టమన్నారు. ఈ అవసరమేమో చాలా తక్కువ సమయానికి అర్జెంటుగా కావల్సి వచ్చింది. మా మలక్‌పేట ఫ్లాటు పూర్ణ పేరన వుంది. మా బావగారు ఎలాగూ ఒప్పుకోరని వేరే సోర్సు ప్రయత్నించా. అప్పుడీ చిట్స్ మేనేజరు వెంటనే ఇచ్చారు. కొంత గోల్డులోను కూడా తీసుకుని మొత్తానికి పని నడిపించా."

"ఏదైనా పెద్ద ఆర్డరు వచ్చిందా?"

"మీకిదివరకు చెప్పానో లేదో నాకు జ్ఞాపకం రావట్లేదు. నేనా మధ్య మద్రాసు వెళ్ళినపుడు 'సౌత్ ఇండియన్ టర్బైన్ లిమిటెడ్' మెటీరియల్స్ మేనేజరు కలిశారు. ఆయనా నేను ఎం.టెక్ ఖరగ్‌పూర్‌లో క్లాస్ మేట్సుం. జర్మనీ నుంచి ఒక ఐటం రెగ్యులర్‌గా లక్ష నంబర్లు ఇంపోర్టు చేసుకుంటున్నామనీ, ఒక్కొక్కటి ధర






250 రూపాయల వరకూ అవుతుందనీ చెప్పి వీలయితే డెవలప్ చేయమనీ నాకు శాంపిల్స్ ఇచ్చారు."

ఈయన అందుకున్నారు. "సరి అయిన ఎగ్రిమెంట్స్ లేకుండా మనం వర్కు చేయకూడదు. తీరా మన టైం, మనీ అన్నీ పెట్టి మనం డెవలప్ చేశాక వాళ్ళు డిజైను మార్చేమంటారు."

"అబ్బబ్బ! అందుకే మనం ఇలాగే వున్నాం. మీ దృష్టి ఎప్పుడూ అవాంతరాల మీదే!

"ఆ ఐటం డవలప్ చేస్తే చిన్న ఆర్డర్లకోసం బాధలు పడక్కరలేదు కదాని ప్రొటో టైపు డెవలప్ చేశాం. ఆర్నెల్లల్లో ప్రొటో టైపు ఎప్రూవ్ కూడా అయింది. 10,000 నంబర్లకి ట్రయిలార్డరు కూడా ఇచ్చారు."

"చూశారా అన్యాయం! ఇంత ప్రోగ్రెస్ వుంటే మాకు పార్టీ లేదు సరికదా విషయమన్నా తెలియలేదు!"

"కథంతా పూర్తిగా వినండి! అప్పుడు మీరే నాకిస్తారు కన్సొలేషన్ పార్టీ!"

"మీరు రెండు వందల కన్నా తక్కువడగ లేదు కదా?" – మావారి సందేహం.

"అదే నే చేసిన పొరపాటు. ఒక్క సాయంత్రం మీ ఇంటికొచ్చి డిస్కస్ చేస్తే కొన్ని పొరబాట్లు జరిగుండేవి కాదు. నేను 75 రూపాయలు కోట్ చేశాను. డెలివరీ పీరియడు చాలా తక్కువ కావడంతో నానా కష్టాలు పడి ఆ ఆర్డరు కంప్లీట్ చేశాను. వెంటనే పేమెంటు ఇచ్చేశారు గాని ఏడున్నర లక్షల ఆర్డరికి నాకు పదిన్నర ఖర్చయింది. 3 లక్షలు జిగ్స్– ఫిక్చర్సులో ఇరుక్కు పోయాయి. మిగిలిన పెద్ద ఆర్డరు చేస్తే డెవలప్‌మెంటు ఖర్చులు అన్నీ రికవరయి పోతాయి కదాని నిశ్చింతగా వున్నా."

"ఇంకా అసలు ఆర్డరు రాలేదా?"

"లేదు. వచ్చే అవకాశం కూడా లేదు. మా సప్లై అయిన రెండు నెలలకి జర్మనీ వాడు 90,000 నంబర్లు ఎయిర్‌లిఫ్ట్ చేశాడు, ఒక్కొక్కటి డెబ్బై రూపాయల చొప్పున! వాళ్ళేమో నన్ను మళ్ళీ చిన్న చిన్న మార్పులతో మళ్ళీ ప్రొటో టైపివ్వమని అడిగారు. ఇప్పటికే ఎవ్వరు చచ్చావంటే ఆర్నెలక్రితం అన్నట్లుంది నా పని. ఈ ఐటం మీద కాన్సన్‌ట్రేట్ చెయ్యడంతో మా రొటీను ఆర్డర్లన్నీ పోడయి పోయాయి.ఇట్లా అవుతుందనుకుంటే ముందే ఎగ్రిమెంటురాసుకునే వాళ్ళం"

"ఎంత అన్యాయం! మరి మీరు వాళ్ళని నిలదీయలేదా?"

"పోటీ వాళ్ళతో యుద్ధం చెయ్యగలం గానీ అనీవెన్ ఫోర్సెస్‌తో చేసి ఏం లాభం? మనకి టైం దండగ. ఇదిగో ఈ గొడవ వల్లే బిల్ కట్టలేక పోయా. మీరయితే విశ్వాన్ని పంపిస్తే గారంటీ మీద సంతకం పెట్టారు గానీ, మా బావగారు సవాలక్ష ప్రశ్నలేసి వారం రోజులు తిప్పారు. ఆ చిట్ వాడు ఆయన దగ్గరక్కూడా వెళ్ళాడట! పొద్దున్నే వెళ్ళి ఆయన్ని కూడా కలిసి వచ్చాను."

"మీ పేరు చెప్పుకుని మద్రాసు వాడికి మూడో వంతు ధరకే కాంపోనెంట్సు దొరికాయి. మీరు చూస్తే ఇలా అల్లరి పడుతున్నారు. ఇంతకీ ఏమిటి మన తక్షణ కర్తవ్యం?"

"ఏముంది! వాళ్ళకి పది ఇన్‌స్టాల్‌మెంట్స్ పెనాల్టీతో కలిపి 38,000 వరకు ఇవ్వాలి. 'ఆపద' చిట్స్‌లో 50 వేల చీటీ, 16 నెలల నించీ కడుతున్నా. మొన్న నాకు వచ్చింది. మినిమమ్ బిడ్డింగు. మీరు దీని మీద సంతకం పెడితే వచ్చే వారం 33 వరకు వస్తుంది. అప్పుడు కట్టేస్తా బ్యాలెన్స్ ఎక్కడన్నా తీసుకుని. దాంతో ఈ తలనొప్పి వదుల్తుంది."

"సరే ఇలాగివ్వండి. చెరువు మధ్యలో కొచ్చాక ఈదడానికి భయపడితే ఎలా?"

"మూర్తిగారూ! ఈసారి మీరూ సుశీలా 'అదృష్ట' చిట్స్‌లో చేరండి. నేను హామీగా ఉంటా!"

నవ్వుకుంటూ ఆయన వెళ్ళిపోయారు. మేమిద్దరం మళ్ళీ మా చార్ట్ ప్రిపరేషన్‌లో పడ్డాం.